కింద పడ్డానని ఆగిపోకు,
తిరిగి ప్రయత్నం చేస్తే
విజయం నీదే
- అబ్దుల్ కలాం

Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 325 | శనివారం 13 జూన్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## నావికుల మృతిపై ప్రధాని మాట్లాడాలి

### - రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



గతవారం అమెరికా బలగాలు ఒమన్ తీరం వద్ద ఉన్న 'సెట్టిబెల్లో' నౌకపై చేసిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందారు. ఈ ఘటనపై ప్రధాని మౌనం వహించడంపై శుక్రవారం లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, 'అంతర్జాతీయ జలాల్లో మూడు నౌకలపై అమెరికా జరిపిన

- మిగతా 2లో..

## రాజ్యసభకు 24 మంది ఏకగ్రీవంగా ఎన్నిక

### - మూడు స్థానాలకు పోటీ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



రాజ్యసభ ఎన్నికలకు దేశవ్యాప్తంగా మొత్తం 27 స్థానాలకు ఎన్నిక జరగగా, అందులో 24 మంది అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. వీరిలో 19 మంది బిజెపి (ఎన్‌డిఎ) అభ్యర్థులుకాగా, మిగతా ఐదుగురు కాంగ్రెస్ నుంచి గెలిచారు. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గెలవగా, కాంగ్రెస్ నుంచి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురైన సంగతి తెలిసిందే.

- మిగతా 2లో..

### దళిత క్రైస్తవులు, ముస్లింల రిజర్వేషన్లపై

## కీలక నివేదిక సిద్ధం

### - త్వరలో కేంద్రానికి జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ నివేదిక
### - దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న సిఫార్సులు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



మతం మారిన దళితులకు ఎస్సీ హోదా, రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం నియమించిన మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేజీ బాలకృష్ణన్ నేతృత్వంలోని కమిషన్ తన నివేదికను సిద్ధం చేసింది. దాదాపు నాలుగేళ్లపాటు దేశవ్యాప్తంగా విస్తృత అధ్యయనం, వివిధ వర్గాల అభిప్రాయాల సేకరణ అనంతరం

- మిగతా 2లో..




## సుప్రీంకోర్టులో మీనాక్షి నటరాజన్‌కు చుక్కెదురు

### - రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత
### - ఎన్నికల ప్రక్రియలో కోర్టు జోక్యం చేసుకోలేదన్న ధర్మాసనం

2 లో

# రెండేళ్లలో నమ్మకం గెలుచుకున్నాం..

- మరింత అభివృద్ధితో ముందుకు వెళ్తాం
- తిరుపతిలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- సంక్షేమం - అభివృద్ధి - సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యం
- ప్రజల తీర్పును గెలుపుగా కాకుండా బాధ్యతగా స్వీకరించాం



నాయుడుపేట-సూర్య వాస్తవం:

రాష్ట్ర ప్రజలు 2024 ఎన్నికల్లో ఇచ్చిన అఖండ విజయాన్ని గెలుపుగా కాకుండా బాధ్యతగా భావించి పాలన ప్రారంభించామని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోని దామినీడులో శుక్రవారం నిర్వహించిన "2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి -- సంక్షేమం" విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రెండేళ్ల పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో సంక్షోభంలో ఉన్న సమయంలో అధికారంలోకి వచ్చామని,

- మిగతా 2లో..



### ఉపాధి హామీ కూలీలకు

## కేంద్రం శుభవార్త

### - 100 రోజుల నుంచి 125 రోజుల పనిదినాలకు పెంపు
### - జూలై 1 నుంచి 'వీబీజీ రామ్' పథకం అమలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

గ్రామీణ ప్రజల ఆర్థిక భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద ప్రస్తుతం అమలులో ఉన్న 100 రోజుల పనిదినాలను 125 రోజులకు పెంచుతూ 'వీబీజీ రామ్' పేరుతో కొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి వెల్లడించారు.

- మిగతా 2లో..



## నా మాటలను మీడియా వక్రీకరించింది

### - సీఎం రేవంత్ రెడ్డి
### - "నాకు హిట్లర్ ఆదర్శం కాదు.. హైడ్రా హిట్లర్ కాలంలో ఉండేదని మాత్రమే చెప్పాను

2 లో

# రాజకీయ కక్ష కాదు.. పోలీసుల అంతర్గత నిర్ణయమే

- పవన్ సభకు అనుమతి నిరాకరణపై సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ
- పవన్ కల్యాణ్‌కు తెలంగాణలో రాజకీయాలు చేసే పూర్తి స్వేచ్ఛ ఉంది : సీఎం



హైదరాబాద్ -సూర్య వాస్తవం:

హైదరాబాద్‌లో జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బహిరంగ సభకు అనుమతి నిరాకరించడం వెనుక ఎలాంటి రాజకీయ కక్షసాధింపు లేదని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇది పూర్తిగా పోలీసు శాఖ తీసుకున్న అంతర్గత నిర్ణయమని తెలిపారు. న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, ఇంటెలిజెన్స్ మరియు భద్రతా సంస్థలు శాంతిభద్రతల సమస్యలు, ట్రాఫిక్ ఇబ్బందులపై నివేదికలు ఇచ్చినప్పుడు ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పవన్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది పవన్ కల్యాణ్ తెలంగాణకు వచ్చేందుకు, రాజకీయాలు చేసేందుకు, ఎన్నికల్లో పోటీ చేసేందుకు పూర్తి స్వేచ్ఛ ఉందని సీఎం స్పష్టం చేశారు. గతంలో ప్రజలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన సందర్భాల్లోనే తమ పార్టీ మంత్రులు స్పందించారని చెప్పారు.

మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదు ఢిల్లీ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో తెలంగాణ

- మిగతా 2లో..

## సీఎం రేవంత్ రెడ్డి విమానానికి తృటిలో తప్పిన ప్రమాదం

### - ప్రతికూల వాతావరణంతో బెంగళూరుకు మళ్లించిన ప్రత్యేక విమానం

2 లో

## శ్రీవారి సేవలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

### - తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న జస్టిస్ లీసా గిల్

3 లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# నావికుల మృతిపై ప్రధాని మాట్లాడాలి

(మొదటిపేజీ తరువాయి)
దాడుల్లో మూడు రోజుల్లోనే ముగ్గురు భారతీయులు మరణించారు. అమెరికాకు లొంగిపోయిన మన ప్రధాని మాత్రం ఇప్పటివరకు ఈ ఘటనపై ఒక్కమాట కూడా మాట్లాడలేదు. ఏదైనా విదేశీ శక్తి ఒక భారతీయుడిని హత్య చేసినప్పుడు ప్రధాని స్పందించాలి. కానీ, ఆయన ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దురదృష్టకరం. మన నావికుల్ని హత్య చేసిన కొద్దిరోజులకే.. అంటే వచ్చేవారమే జి7 సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో మోడీ గారు చిరునవ్వు చిందిస్తూ.. ఆలింగనం చేసుకుంటూ.. ఒప్పందాలపై సంతకాలు చేస్తారు. కానీ చనిపోయిన ఈ ముగ్గురు భారతీయుల గురించి మాత్రం ఆయన ఒక్కమాట కూడా మాట్లాడరు. తమ ప్రాణాలను బలిగొన్న వారిని ఎదిరించే ధైర్యం గానీ, శక్తి గానీ లేని ఒక లొంగిపోయిన ప్రధానమంత్రి 'భారతమాత' బిడ్డలను రక్షించలేరు' అని మోడీ తన సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో మోడీని తీవ్రంగా విమర్శించారు.

# రాజ్యసభకు 24 మంది ఏకగ్రీవంగా ఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)
ఈ ఎన్నికల ఫలితాల తరువాత రాజ్యసభలో ఎన్‌డిఎ-3, కాంగ్రెస్-1 సీటు పెంచుకున్నాయి. ఎపిలో వైసిపి 3 రాజ్యసభ స్థానాల్ని, ఒరిస్సాకు చెందిన బిజెడి కూడా ఒక సీటును కోల్పోయాయి. ఎపి నుంచి టిడిపి-3, జనసేన-1 స్థానాలు దక్కించుకున్నాయి. గుజరాత్ నుంచి నాలుగు స్థానాలు బిజెపికే దక్కాయి. కర్ణాటకలో ఒక స్థానం ఎన్‌డిఎకు, మూడు స్థానాలు కాంగ్రెస్ గెలిచాయి. మధ్యప్రదేశ్-3, రాజస్తాన్ -2, ఒరిస్సా-1, మణిపూర్-1, అరుణాచల్ ప్రదేశ్-1, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ గెలుచుకోగా, రాజస్తాన్-1, తమిళనాడు-1 సీట్లను కాంగ్రెస్‌కు గెలుచుకుంది. మేఘాలయ నుంచి జేమ్స్ కె సంగ్మా (ఎన్‌పిపి), మహారాష్ట్ర నుంచి రాజేంద్ర జైన్ (ఎన్‌సిపి)లు దక్కాయి. ఇప్పుడు అందరి దృష్టి జార్ఖండ్, మిజోరం రాజ్యసభ ఎన్నికలపైనే ఉంది. జార్ఖండ్‌లో రెండు రాజ్యసభ సీట్లు ఉండగా, ముగ్గురు పోటీలో ఉన్నారు. మిజోరంలో ఒక రాజ్యసభ సీటు ఉండగా, జడ్‌పిఎం ప్రతినిధి కె.లామ్‌ట్‌లాంగ్ కిమా, ఎంఎన్‌ఎఫ్ నేత జోథాన్‌సంగి హ్మార్ ఎన్నికల బరిలో ఉన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి విమానానికి తృటిలో తప్పిన ప్రమాదం

### - ప్రతికూల వాతావరణంతో బెంగళూరుకు మళ్లించిన ప్రత్యేక విమానం

**హైదరాబాద్-సూర్య వాస్తవం :**తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానానికి తృటిలో ప్రమాదం తప్పింది. ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వస్తున్న సీఎం విమానాన్ని ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా అత్యవసరంగా బెంగళూరుకు మళ్లించారు. శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానం ల్యాండ్ అయ్యే సమయానికి ఒక్కసారిగా భారీ వర్షం, ఈదురుగాలులు ప్రారంభమయ్యాయి. దీంతో రన్‌వే స్పష్టంగా కనిపించకపోవడం, గాలి వేగం అధికంగా ఉండటంతో విమానాన్ని ల్యాండ్ చేయడం సురక్షితం కాదని పైలట్ నిర్ణయించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పరిశీలించిన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అధికారులు కూడా ముఖ్యమంత్రి భద్రతను దృష్టిలో ఉంచుకుని ల్యాండింగ్‌కు అనుమతి ఇవ్వలేదు. కొంతసేపు గాల్లోనే చక్కర్లు కొట్టిన విమానం పరిస్థితులు మెరుగుపడకపోవడంతో అధికారుల సూచన మేరకు కర్ణాటక రాజధాని బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించబడింది. విమానం సురక్షితంగా బెంగళూరు విమానాశ్రయంలో ల్యాండ్ అయినట్లు సమాచారం. ముఖ్యమంత్రి సహా విమానంలోని ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నారని అధికారులు తెలిపారు.

# నా మాటలను మీడియా వక్రీకరించింది

### - సీఎం రేవంత్ రెడ్డి

### - "నాకు హిట్లర్ ఆదర్శం కాదు..

### హైడ్రా హిట్లర్ కాలంలో ఉండేదని మాత్రమే చెప్పాను

**హైదరాబాద్-సూర్య వాస్తవం :** తన హిట్లర్ వ్యాఖ్యలపై జరుగుతున్న రాజకీయ విమర్శలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. తన వ్యాఖ్యలను కొన్ని మీడియా సంస్థలు, రాజకీయ ప్రత్యర్థులు వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నాకు హిట్లర్ ఆదర్శం అని నేను ఎక్కడా చెప్పలేదు. హైడ్రా వంటి వ్యవస్థ హిట్లర్ కాలంలో కూడా ఉండేదని మాత్రమే ప్రస్తావించాను. కానీ నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకుని ప్రచారం చేస్తున్నారు" అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల ప్రయోజనాల కోసం అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునే వ్యవస్థల గురించి మాట్లాడిన సందర్భంలో తన వ్యాఖ్యలు వచ్చాయని తెలిపారు. అయితే వాటిని రాజకీయంగా మలిచి తనపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఇటీవల హిట్లర్ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు, పలు రాజకీయ పార్టీలు తీవ్ర విమర్శలు చేయగా, తాజాగా సీఎం చేసిన ఈ వివరణ రాజకీయ వర్గాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# ఉపాధి హామీ కూలీలకు కేంద్రం శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)
గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడం, పేద కుటుంబాలకు అదనపు ఆదాయం కల్పించడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఈ కొత్త పథకం 2026 జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానుంది. అదనంగా 25 రోజుల ఉపాధి కల్పించడం ద్వారా గ్రామీణ కుటుంబాల జీవనోపాధికి మరింత భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగాన్ని తగ్గించడంతో పాటు, వ్యవసాయ అనుబంధ పనులు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ నిర్ణయం దోహదపడుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఉపాధి హామీ పథకం చరిత్రలో ఇది కీలకమైన మార్పుగా నిలుస్తుందని కిషన్ రెడ్డి అన్నారు.

# సుప్రీంకోర్టులో మీనాక్షి నటరాజన్‌కు చుక్కెదురు

### - రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత

### - ఎన్నికల ప్రక్రియలో కోర్టు జోక్యం చేసుకోలేదన్న ధర్మాసనం

**న్యూఢిల్లీ -సూర్య వాస్తవం :** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో ఆమె నామినేషన్ తిరస్కరణను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అతుల్ ఎస్. చందూర్కర్లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. నామినేషన్ తిరస్కరణ వంటి ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన అంశాల్లో నేరుగా జోక్యం చేసుకునే అధికారం కోర్టుకు లేదని స్పష్టం చేసింది.

**ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించాలి**

మీనాక్షి నటరాజన్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, ఆమెపై రెండేళ్లకు పైగా శిక్ష పడే ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ధర్మాసనం ఈ వాదనలను అంగీకరించలేదు. ఒకసారి రిటర్నింగ్ అధికారి నామినేషన్‌ను తిరస్కరించిన తర్వాత, ఆ నిర్ణయాన్ని ఎన్నికల కమిషన్ ముందు సవాలు చేయవచ్చని, ఇలాంటి వ్యవహారాల్లో కోర్టు నేరుగా జోక్యం చేసుకోలేదని పేర్కొంది.

**విచారణకు అర్హత లేదంటూ పిటిషన్ కొట్టివేత**

గతంలో ఇలాంటి అంశాల్లో కోర్టులు జోక్యం చేసుకున్న ఉదాహరణలు ఉంటే చూపించాలని సూచించిన ధర్మాసనం, ఈ పిటిషన్ విచారణకు అర్హత లేదని పేర్కొంటూ తోసిపుచ్చింది.

**నామినేషన్ తిరస్కరణకు కారణం ఇదే**

మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరఫున మీనాక్షి నటరాజన్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే తెలంగాణలో నమోదైన ఒక కేసు వివరాలను నామినేషన్ పత్రాల్లో వెల్లడించలేదని బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవత్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన రిటర్నింగ్ అధికారి నామినేషన్‌ను తిరస్కరించారు. తనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని, కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని కాంగ్రెస్ వాదించినప్పటికీ, సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో ఆ వాదనకు ఊరట లభించలేదు.

# రెండేళ్లలో నమ్మకం గెలుచుకున్నాం..







(మొదటిపేజీ తరువాయి)
విధ్వంసమైన వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టేందుకు కృషి చేశామని తెలిపారు. ప్రజలు ఇచ్చిన 57 శాతం ఓటు షేర్, 164 స్థానాల విజయంతో ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వానికి రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యత అప్పగించారని అన్నారు.

**సూపర్ సిక్స్ హామీల అమలుకు ప్రాధాన్యం**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా వేలాది కోట్ల రూపాయల పెన్షన్లు పంపిణీ చేశామని, తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల విద్యకు చేయూత అందిస్తున్నామని తెలిపారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే గీత కార్మికులు, అర్చకులు, వడ్డెర్లు, ఇమామ్‌లు తదితర వర్గాలకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు.

**పరిశ్రమలు -- ఉపాధి అవకాశాలే లక్ష్యం**

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు పారిశ్రామిక విధానాలను తీసుకొచ్చామని, గతంలో రాష్ట్రాన్ని విడిచి పోయిన పెట్టుబడిదారులు మళ్లీ ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాయలసీమలో డిఫెన్స్, డ్రోన్, స్పేస్ రంగాలకు సంబంధించిన పరిశ్రమలు రానున్నాయని, తిరుపతి జిల్లాలో రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ యూనిట్ ఏర్పాటు అవుతోందని తెలిపారు. పుట్టపర్తిలో ఐదో తరం యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేశామని చెప్పారు.



**అభివృద్ధికి అడ్డంకులు సృష్టించే వారిపై విమర్శలు**

రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుంటే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని ముఖ్యమంత్రి విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఆర్థికంగా, పరిపాలనా పరంగా తీవ్ర నష్టాలను చవిచూసిందని ఆరోపించారు. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి కేంద్రాలుగా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామని పేర్కొన్నారు.

**మోదీ నాయకత్వాన్ని ప్రశంసించిన సీఎం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని చంద్రబాబు కొనియాడారు. పోలవరం, అమరావతి, విశాఖ ఉక్కు కర్మాగారం, రైల్వే జోన్ తదితర అంశాల్లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు.

**పథకాల లబ్ధిదారుల అనుభవాలు**

సభలో వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలను పంచుకున్నారు. తల్లికి వందనం, ప్రకృతి వ్యవసాయం, ఇన్నోవేషన్ హబ్, గృహ నిర్మాణ పథకాల ద్వారా తమకు కలిగిన ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

**యువశక్తే రాష్ట్ర భవిష్యత్తు**
**-- అభివృద్ధే కూటమి లక్ష్యం**

తిరుపతిలో నిర్వహించిన రెండేళ్ల విజయోత్సవ సభ కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసిందని నాయకులు పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనతో స్వర్ణాంధ్ర సాధన దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.

# దళిత క్రైస్తవులు, ముస్లింల రిజర్వేషన్లపై కీలక నివేదిక సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)
ఈ నివేదికను రూపొందించినట్లు సమాచారం. దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) హోదా కల్పించాలా లేదా అనే అంశంపై కమిషన్ సవివరంగా పరిశీలించింది. ప్రస్తుతం నివేదిక ముద్రణ దశలో ఉండగా, త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలుస్తోంది. మతం మారిన తర్వాత కూడా దళితులు సామాజిక వివక్ష, వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నారా అనే అంశంపై కమిషన్ విస్తృతంగా అధ్యయనం చేసింది. పలు రాష్ట్రాల్లో పర్యటించి బాధిత వర్గాలు, సామాజిక సంస్థలు, నిపుణుల అభిప్రాయాలను సేకరించింది.

ప్రస్తుతం 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వు ప్రకారం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన దళితులకు మాత్రమే ఎస్సీ హోదా వర్తిస్తోంది. అయితే క్రైస్తవ, ముస్లిం మతాల్లోకి మారిన దళితులకు కూడా అదే హోదా కల్పించాలని దళిత సంఘాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఇక మరోవైపు, ఇస్లాం మరియు క్రైస్తవ మతాల్లో కుల వ్యవస్థ లేదని కేంద్ర ప్రభుత్వం గతంలో సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది.

ఈ నేపథ్యంలో జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్ సిఫార్సులు ఎలా ఉండబోతున్నాయనే అంశంపై దేశవ్యాప్తంగా రాజకీయ, సామాజిక వర్గాల్లో ఆసక్తి నెలకొంది. జూన్ 10తో కమిషన్ గడువు ముగిసినప్పటికీ, నివేదిక సమర్పణ కోసం కేంద్ర ప్రభుత్వం మరో 10 రోజుల గడువు పొడిగించింది.

# సంపాదకీయం

## బడిలోనే .. దేశ భవిష్యత్‌కు పునాది !



విద్యావైద్యమే పేదరిక నిర్మూలనకు సామాజిక పురోభివృద్ధికి దోహదపడతాయని సిఎం రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్‌లో చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కులరహిత సమాజానికి ఇది దోహదపడుతుందని కూడా అభిప్రాయపడ్డారు. అయితే ఇది ఎంతవరకు ఆచరణ చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకునే సమయం వచ్చింది. స్కూళ్లు తెరవబోతున్నారు. గత రెండున్నరేళ్లుగా స్కూళ్లను ఏ మేరకు అభివృద్ధి చేశారో చెప్పాలి. వసతి గృహాలు మృత్యుకుహరాలుగా మారాయి. యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ఊదర గొట్టడం కాకుండా ఉన్న స్కూళ్లను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. ఒకవేళ యంగ్ ఇండియా స్కూళ్లు కావాలనుకుంటే..వాటితో పాటు ఉన్న స్కూళ్లను బలోపతేం చేయాలి. స్కూళ్లను హాస్టళ్లను అనుసంధానించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీనిగురించి పట్టించుకోవడం లేదు. పాఠశాలల తో వసతిగృహాలను అనుసంధానించి, సకల సౌకర్యాలు కలిగిస్తే...సిఎం రేవంత్ కోరుకున్న కులరహిత విద్యావిధానం సాధ్యమవుతుంది. అందుకు పెద్దగా పెట్టుబడులు అవసరం లేదు. ఇప్పుడు ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లోనే కలెక్టర్లకు ఈ పని అప్పగించి పర్యవేక్షిస్తే సత్వర విజయం సాధించవచ్చు. ఎందుకంటే...స్వేచ్ఛా వాతావరణంలో ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన బాలలు పనిలో బందీ అవుతున్నారు. అక్షరాలు దిద్దాల్సిన సమయంలో పత్తి చేలలో పనిచేస్తున్నారు. పుస్తకాల సంచీతో బడికి వెళ్లాల్సిన వారు హోటళ్లు, మెకానిక్ షెడ్లలో కార్మికులుగా మారుతున్నారు.. అక్షరాలు దిద్దాల్సిన చేతులతో బట్టీల్లో ఇటుకలను మోస్తున్నారు. అందుకు తల్లిదండ్రుల పేదరికమే ప్రధాన కారణం. చదువు ప్రాధాన్యంపై వారికి అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత ఇతర కారణాలని చెప్పవచ్చు. పేదరికం బాలల పాలిట శాపంగా మారకుండా ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించే బాధ్యత గ్రామాలకు అప్పగించాలి. సర్పంచ్‌లను ఇందుకు బాధ్యులను చేయాలి. ఆర్థిక స్థోమత లేక,కుటుంబ పోషణ భారమై తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి బదులు పనులకు పంపిస్తున్నారు. కొందరు గొర్రెలు, పశువుల కాపరులుగా మారుతున్నారు. మరికొందరు బాలలు యాచకులుగా వీధుల్లో కనిపించడం ఆవేదన కలిగిస్తోంది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఎన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయి ఫలితాలు సాధ్యం కావడం లేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఇటుక బట్టీల్లో బాలలు కూలీలుగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల రిజిస్టర్‌లో పేర్లు ఉన్నా.. బాలలు మాత్రం పత్తిచేలల్లో, ఇటుకల బట్టీల్లో పని చేస్తుంటారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో ఇలా వందలాది మంది బాల కార్మికులను గుర్తించారు. ఈ క్రమంలో మళ్లీ స్కూళ్లు తెవరబోతున్న క్రమంలో పిల్లల సంఖ్య పెంచాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఒక ప్రణాళిక లేకపోవడం వల్ల వారు పాఠశాల వరకు రాలేకపోతున్నారు. పిల్లలకు ఉచితంగా భోజనం కల్పిస్తున్నా ఆకర్శించలేకపోతున్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో సర్వే చేయిలి. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి. ఎందుకంటే దేశ భవిష్యత్ పాఠశాల నుంచే మొదలవుతుంది. ఆరోగ్యకరమైన సమాజం కావాలంటే చదువు కావాలన్న సంకల్పాన్ని నెరవేర్చడం అవసరం. ఇందుకోసం ప్రణాళిక అవసరం. వసతి గృహాల్లో వసతులు లేవు. అలాంటి వాటిని నడిపే బదులు గ్రామాల్లోనే తల్లిదండ్రుల వద్ద పిల్లలను అప్పగించి, స్కూళ్లకు పంపడం నేర్పించాలి. స్కూళ్లో పెన్సిల్ మొదలు, పుస్తకాలు బట్టలు, ఫీజులు ఉచితం చేయాలి. కులమతాలకు అతీతంగా చేసి మంచి భోజన వసతులు స్కూళ్లలోనే కల్పించాలి. అప్పుడు పిల్లలు ఇంటినుంచే స్కూళ్లకు వచ్చేందుకు ఇష్టపడతారు. తల్లిదండ్రులు కూడా ఇందుకు ఒప్పుకుంటారు. ఇది పెద్దగా బడ్జెట్‌తో కూడుకున్న పనికాదు. ఇప్పుడు హాస్టళ్లకు పెడుతున్న ఖర్చుతో దీనిని నెరవేర్చవచ్చు. ఇలా చేస్తే వారే

రేపటి పౌరులుగా తయారవుతారు. మనం నేర్పిన నడవడిక, మనం తీర్చిదిద్దిన అక్షరాలు వారి జీవిత గమ్యానికి బాటలు వేస్తాయి. పిల్లలు ఎలా ఎదిగాలి, ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలి. సమాజాభివృద్ధికి ఉపయోగపడే వ్యక్తిత్వ వికాసాన్ని పిల్లలు పుణికి పుచ్చుకునేలా బడిలోనే పునాది వేయాల్సి ఉంటుంది. గత అనుభవాలను మననం చేసుకుంటూ ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ బడి పట్ల సమాజానికి నమ్మకం కలిగేటట్లు కార్యాచరణ సిద్ధం చేస్తే మంచిది. ఇందుకు తల్లిడదండ్రులను, గ్రామంలో పెద్దలను పలకరిస్తే బోలెడు సమాచారం చెబుతారు. ప్రభుత్వ బడి బాగా నడుస్తుందంటే మన సమాజం బాగుపడ్డట్లుగానే భావించాలి. ఎందుకంటే ఇప్పటికీ ఇంకా ప్రభుత్వ బడి పట్ల నమ్మకం కలిగిన తల్లిదండ్రులు ఈ సమాజంలో ఉన్నారు. వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులకు నాలుగు అక్షరాలు, నైతిక విలువలు నేర్పే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాల్సిందే. ఆటంకాలు ఎన్నొచ్చినా ప్రభుత్వం బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను తిప్పినా.. పిల్లలకు తగు న్యాయం చేయటం కూడా ఉపాధ్యాయుల బాధ్యత. అలాగే పిల్లలకు బోధన చేసే ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు బడిలో పిల్లలకు బోధన మాత్రమే చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పాస్ టార్గెట్లు పెట్టడం వల్ల పిల్లలలో సృజనాత్మకత దెబ్బ తింటుంది. బట్టీయ పద్ధతి వల్ల సృజనాత్మకంగా ఆలోచించటం మరచి భవిష్యత్తు అంతా ఎదుటి వాళ్ళ మీద ఆధారపడటం తప్ప తనంతట తను బతకడం అలవాటు లేని పరిస్థితులలోకి నెట్టివేయ బడతారు. ఇవన్నీ అధిగమించాలంటే ప్రభుత్వ సంకల్పమే ముఖ్యం. నీతి ఆయోగ్ సమావేశంలో చెప్పిన అంశాలను ఆచరణలో పెట్టాలి. అందుకు అనుగుణంగా ముందు రాష్ట్రంలోని పాఠశాలల పరిస్థితులను తెలుసుకుని వాటిని బాగు చేయాలి. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపగలిగేలా పరిస్థితుల్లో మార్పు తీసుకుని రావాలి. అలాగే ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీని కూడా అరికట్టాలి. లక్షల్లో ఫీజులు కట్టడం కోసం తల్లిదండ్రులు నానా యాతన పడుతున్నారు. ఇది తప్పాలంటే ప్రభుత్వ బడులు బలోపేతం కావాలి. అందుకు సంకల్పం ఉంటే మార్పు సాధ్యమే.



# రెచ్చిపోతున్న మైనర్ బైక్ రేసర్లు

- సోషల్ మీడియాలో ఎక్కువ వ్యూస్, లైకుల కోసం ప్రాణాలతో చెలగాటం
- ప్రమాదకర విన్యాసాలు చేస్తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్న వైనం
- తల్లిదండ్రులను ఖరీదైన బైక్‌లు కొనివ్వమని వేధించడం
- తాట తీసిన కదిరి పోలీసులు
- తహసీల్దార్ సమక్షంలో రూ. 5 లక్షల షూరిటీ బాండ్లు

**బైక్ రేసులు... యువత రయ్ రయ్ మంటూ రోడ్లమీద దూసుకుపోతారు. ఖరీదైన బైక్‌లు రోడ్ల మీద విన్యాసాలు చేస్తారు. సోషల్ మీడియా లైక్ ల కోసం బైక్ పై వెర్రి వేషాలు వేస్తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు .....**


ఫైల్ ఫొటో

**అనంతపురం క్రైమ్ / కదిరి - సూర్య వాస్తవం :**

యువత బైక్ రేసింగ్, వీలింగ్ వంటి ప్రమాదకర విన్యాసాలకు పాల్పడుతూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటు న్నారు. ఖాళీ రోడ్లు, రాత్రి సమయాలను ఎంచుకుని అత్యంత వేగంగా బైక్‌లను నడపడం వల్ల వారి ప్రాణాలతో పాటు సాధారణ ప్రజల భద్రతకు కూడా తీవ్ర ముప్పు వాటిల్లు తోంది. సోషల్ మీడియాలో ఎక్కువ వ్యూస్, లైకుల కోసం ప్రాణాలతో చెలగాట మాడటం, తల్లిదండ్రులను ఖరీదైన బైక్‌లు కొనివ్వమని వేధించడం... అన్నం తినడం మానేయడం కొందరైతే సూసైడ్ చేసుకుంటాం అంటూ తల్లిదండ్రులను భయపెట్టి మరి స్పోర్ట్స్ బైక్ కొనిచ్చుకుంటున్నారు.బైక్ రేస్ ల సంస్కృతి వల్ల యువకులు పాడైపోతున్నారని, ప్రాణాల మీదకి తెచ్చుకుని కన్నవారికి శోకం మిగులుస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా యువత పట్టించుకోవడం లేదు. యువకులు నిత్యం రోడ్డుపై హంగామా సృష్టిస్తున్నా.. ట్రాఫిక్ పోలీసులు మాత్రం చలాన్లకే పరిమితం చేస్తున్నారు.రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అత్యంత వేగంతో ప్రమాదకర విన్యాసాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సోషల్ మీడియాలో ఫేమస్ అవ్వాలని లైక్ ల కోసం యువత తమ జీవితాన్ని పనంగా పెట్టి విన్యాసాలు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. యువకులు 100 నుండి 150 కి.మీ వేగంతో అత్యంత వేగంగా రోడ్లపై స్పీడ్ పెంచి సైలెన్సర్లతో విపరీతమైన సౌండ్ లు చేస్తూ వాహనదారులకు, ప్రజలకు భయాందోళనకు గురిచేస్తున్నారు. బైక్ నడుపుతున్న వారందరూ మైనర్లు ఉండటం గమనార్హం.....

**తాట తీసిన కదిరి పోలీసులు**

కదిరిలో బైక్ రేసింగ్, వీలింగ్ వంటి ప్రమాదకర విన్యాసాలకు పాల్పడుతున్న యువకులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. నగరంలో ప్రజల ప్రాణాలకు హాని కలిగిస్తున్న యువకులను గుర్తించి కఠిన చర్యలు తీసుకున్నారు.మదనపల్లి రోడ్డు, కౌలేపల్లి బ్రిడ్జి, న్యూ బైపాస్, కుటాగుళ్ల, మరియు కాలేజీ సర్కిల్ పరిసరాల్లో ఈ రేసింగ్ ఎక్కువగా జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. యువకులపై కేసులు నమోదు చేయడమే కాకుండా, తహసీల్దార్ సమక్షంలో రూ. 5 లక్షల షూరిటీ బాండ్లు రాయించుకున్నారు.

**ఇంత జరిగినా..... ఆగని రేసులు..?**

కదిరి పోలీసులు ఇలాంటి వాటిని అరికట్టడానికి ఒక అడుగు ముందుకేసి కొన్ని రోజులక్రితం కొంతమంది మైనర్లను బైండోవర్ చేయడం పిల్లల తల్లి తండ్రులను పిలిపించి దండించారు. అయినా ప్రతిరోజు నిజాం వాలి కాలనీ నుండి మదనపల్లి లోని బైపాస్ రోడ్డు వరకు ముందరి చక్రాలు పైకి లేపి స్టంట్ రేసింగ్ దానికి బెట్టింగులు అలాగే ఈ మధ్యప్రదేశంలో వాల్మీకి స్కూలు ప్రాంగాణ్యం చుట్టుప్రక్కల గంజాయి కూడా అమ్మడం సేవించడం ఎక్కువయ్యిందని ఆ ప్రాంతా ప్రజలు అనేక సార్లు ఫిర్యాదులు చేసినా 100 కు డైల్ చేసినా ఫలితంలేదని అంటున్నారు ఇప్పటికైనా కదిరి పోలీసులు మైనారిటీ ఫంక్షన్ వాల్మీకీ స్కూల్ మరియు రిలేబుల్ ఆటోమొబైల్స్ మహేంద్ర, ఏం.షాపి మధ్య లొ బారికేడ్లు పెట్టి కొన్ని రోజులు పూర్తిగా 24 గంటలు నిఘా ఉంచితే కొంతైనా ఆపవచ్చునన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు



# రాజకీయ కక్ష కాదు..
## పోలీసుల అంతర్గత నిర్ణయమే

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గ విస్తరణ అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని ఆయన తెలిపారు. మోదీతో భేటీపై స్పందన ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీ గురించి మాట్లాడుతూ, సమావేశంలో ప్రధాని మోదీనే తనను కౌగిలించుకున్నారని, తాను వెళ్లి కౌగిలించుకోలేదని పేర్కొన్నారు.

కేంద్రంపై తీవ్ర విమర్శలు తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని సీఎం ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన పలు ప్రాజెక్టుల నిధులు నిలిచిపోవడానికి, రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) పనుల జాప్యానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కారణమని విమర్శించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించేందుకు కిషన్ రెడ్డి ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీతో ఆయన ఒక్కసారైనా మాట్లాడారా అని నిలదీశారు.బీజేపీపై వ్యంగ్యాస్త్రాలు బీజేపీకి "ఓటు చోరీ లేదా సీటు చోరీ" మాత్రమే తెలుసని ఎద్దేవా చేసిన రేవంత్ రెడ్డి, మధ్యప్రదేశ్‌లో తగిన సంఖ్యాబలం లేకున్నా మూడో అభ్యర్థిని బరిలోకి దించడం ద్వారా ఆ పార్టీ వైఖరి బయటపడిందన్నారు.

**మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై స్పందన**

కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించడం అప్రజాస్వామిక చర్య అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆమెపై ఎలాంటి కేసు లేకపోయినా రాజకీయ కక్షతోనే ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనివల్ల బీజేపీ మహిళా వ్యతిరేక వైఖరి మరోసారి బయటపడిందని విమర్శించారు.

# శ్రీవారి సేవలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
## - తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న జస్టిస్ లీసా గిల్



**తిరుమల - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ శు క్రవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమల చేరుకున్న ఆమెకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయం వద్దకు చేరుకున్న ప్రధాన న్యాయమూర్తికి టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు సంప్రదాయబద్ధంగా ఆలయ మర్యాదలతో ఆమెను ఆలయంలోకి ఆహ్వానించారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు జస్టిస్ లీసా గిల్‌కు వేదాశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో, అదనపు ఈవో ఆమెకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో లోకనాథం, టీటీడీకి చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తీవ్ర ఉద్రిక్తతల నడుమ
## మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అక్రమ అరెస్ట్!



**తాడిపత్రి – సూర్య వాస్తవం :** ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకు సిద్ధమైన తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది.ముందస్తుగా ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు, అనంతరం అనంతపురానికి తరలించారు.

**ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం:** ప్రజల పక్షాన నిలబడి, వారి సమస్యలపై ప్రశ్నించేందుకు వెళ్తున్న నాయకులను ఈ రకంగా అడ్డుకోవడం ముమ్మాటికీ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని స్థానిక నేతలు, ప్రజలు మండిపడుతున్నారు. అరెస్టులు, ఆంక్షలు విధించడం ద్వారా ప్రభుత్వం తన ప్రజా వ్యతిరేక విధానాలను దాచలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పోరాటం ఆగదు.. ప్రజల గొంతు మూగబోదు:** పోలీసుల బెదిరింపులు, అక్రమ అరెస్టులతో ప్రజల గొంతును నొక్కలేరని పౌర సమాజం స్పష్టం చేస్తోంది. "నిజం కోసం, ప్రజల హక్కుల కోసం మా పోరాటం ఎప్పటికీ ఆగదు" అంటూ కార్యకర్తలు, ప్రజలు నినాదాలు చేస్తున్నారు. ఈ అరెస్టు పట్ల తాడిపత్రి నియోజకవర్గంలో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి

## అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు
### - కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి చౌడమ్మ తల్లి



**పులివెందుల – సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన అధిక జ్యేష్ఠ మాసము చివరి శుక్రవారము పురస్కరించుకుని ఉదయస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పంచామృతాభిషేకం, కుంకు మార్చన, మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం అమ్మవారు విశేష పూల అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు. ప్రత్యేకించి ఆలయున ఉదయం 10.30 నిమిషములకు రాహుకాల దీపాలు వెలిగించి రాహుకాల పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భముగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ ( పవీణ్ స్వామి మాట్లాడుతూ ప్రతి శుక్ర,పౌర్ణమి,అమావాస్య రోజున అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీర వడిబయ్యము, కుంకుమార్చన, బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు. ప్రత్యేకించి ఆది, మంగళ, శుక్రవారములు, పౌర్ణమి,అమావాస్య రోజున అమ్మవారికి 108 ప్రదక్షిణములు చేసి 108 పసుపు కొమ్ముల మాల సమర్పించి నమస్కరించిన యెడల కోరిన కోరికలు తీరుతాయని భక్తుల అపారమైనటువంటి నమ్మకము.కష్టాలలో ఉన్నపుడు అమ్మను స్మరించిన కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం, ప్రతీ పౌర్ణమి రోజున సాయంత్రము ఆలయ ప్రకారిత్సవము అనంతరం అల్పాహారం ఏర్పాటు చేయుట జరుగుతుందని తెలిపారు.ఆలయ ప్రాంగణం మొత్తము అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి. .ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ,భక్తదులందరూ పాల్గొన్నారు

## నూతన వధూవరులను
## ఆశీర్వదించిన ఎంపీ వైస్ అవినాష్ రెడ్డి



**వేముల – సూర్య వాస్తవం:** వైఎస్ఆర్సిపి నాయకులు షరీఫ్ ఆహ్వానం మేరకు ఎంపీ వైస్ అవినాష్ రెడ్డి శుక్రవారం ఉర్దూ ఘర్ షాదీ ఖానా వెళ్లి కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు.గురువారం జరిగిన వివాహ వేడుక సందర్భంగా షరీఫ్ కుమారుడు లతీఫ్ దంపతులను కలిసి వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగా ఎంపీ వైస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ నవదంపతులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆశీర్వదించారు. కొత్త జీవితంలో పరస్పర అవగాహనతో ముందుకు సాగుతూ కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.ఎంపీ వైస్ అవినాష్ రెడ్డి రాకతో షరీఫ్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఆయనకు సాదర స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు,మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి,జడ్పిటిసి కొకటం వెంకట బయపురెడ్డి, ఎంపీపీ, మాజీ ఎంపీటీసీ రాధాకృష్ణయ్య, వోక్స్ బోర్డ్ మాజీ నెంబర్ గౌస్పీరా, కో ఆప్షన్ మెంబర్ మండి మాఫీ రా, సన్నిహితులు పాల్గొని నవదంపతులకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

# పోలీసు సిబ్బంది సంక్షేమానికి మరో ముందడుగు

- ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్స్ పంపిణీ
- డి.యస్.పి మురళి, ట్రాఫిక్ సి.ఐ, జి.ప్రసాదరావు




**పులివెందుల – సూర్య వాస్తవం:** కడప జిల్లా ఎస్పీ . షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ ఆదేశాలపై, మండుతున్న ఎండల్లో ప్రజల రక్షణకొరకు విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, తీసుకున్న నిర్ణయం మేరకు, కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఉత్తర్వుల మేరకు పులివెందుల ట్రాఫిక్ పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 23 మంది పోలీస్ సిబ్బందికి టోపీలు, చలువ కళ్ళద్దాలు, మాస్క్ లు,ఓ ఆర్ ఎస్ ప్యాకెట్స్, వాటర్ బాటిల్ తో కూడిన సమ్మర్ కిట్స్ ను పులివెందుల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారము నిర్వహించిన కార్యక్రమంలో పులివెందుల డి.యస్.పి శ్రీ.బుక్కే మురళి చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా డి.యస్.పి మురళి నాయక్ మాట్లాడుతూ వేసవి కాలంలో మండుటెండలో ట్రాఫిక్ విధులు నిర్వహించడం చాలా కష్టంతో కూడుకున్నదన్నారు. రోజంతా రహదారులపై ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలు నిర్వర్తించే పోలీసు సిబ్బంది తీవ్రమైన ఎండ, వడగాల్పుల ప్రభావానికి గురికాకుండా ఉండేందుకు ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర డిజిపి ఆదేశాలపై కడప జిల్లా యస్.పి నచికేత్ విశ్వనాథ్ ఉత్తర్వుల మేరకు, వేసవిలో ఉపశమనం పొందడానికి ఈ సమ్మర్ కిట్స్ ను పులి వెందుల ట్రాఫిక్ విధులు నిర్వర్తించే సిబ్బందికి అందజేయడమైంద న్నారు. ఈ సమ్మర్ కిట్లు పోలీసు సిబ్బందికి ఎండ ప్రభావం నుంచి కొంత ఉపశమనం కలిగించడమే కాకుండా, విధులను మరింత సమర్థవంతంగా నిర్వహిం చేందుకు తోడ్పడతాయని పేర్కొన్నారు. అలాగే విధుల్లో ఉన్న సిబ్బంది వడదెబ్బ వంటి ప్రమాదకర పరిస్థితులకు లోను కాకుండా తరచూ నీరు, ఓఆర్ఎస్ తాగడం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వేసవిలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటూనే ప్రజలకి మెరుగైన సేవలం దించాలని డి.యస్.పి మురళి సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటూ వేసవిలో సమ్మర్ కిట్ను అందించిన జిల్లా ఎస్పీ, డియస్పి సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ట్రాఫిక్ సి.ఐ జి.ప్రసాద రావు, సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రమాదాలకు నిలయంగా మ్యాన్ హోల్స్



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఎస్బిఐ కాలనీ 17 వ వార్డు సచివాలయము దగ్గర రోడ్డు గుంతలయం, మ్యాన్‌హోల్స్, రిలయన్స్ ట్రెండ్స్ పక్క వీధులలో ఉన్న మ్యాన్‌హోల్స్ మూతలు పలుచోట్ల పగిలిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికుల వివరాల మేరకు మ్యాన్ హోల్ మూతలు ధ్వంసం కావడంతో అటుగా వెళ్లే పాదాచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. కొద్దిపాటి వాన చినుకులు పడిన గుంతలు నీటిమయం అవుతున్నాయి. ప్రత్యేకంగా రాత్రి వేళల్లో గోతిని గుర్తించలేక ప్రమాదాలు జరిగే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై కొత్త మూత ఏర్పాటు చేసి, గుంతల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ
### - వీల్ చైర్స్, రోలేటర్లు, అంధ విద్యార్థులకు బ్రెయిలీ కిట్స్ అందించిన ఎంఈఓలు వెంకటేశ్వర రెడ్డి, వెంకటేశ్వర నాయక్



**ప్యాపిలి –సూర్య వాస్తవం:** నంద్యాల జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్యాపిలి మండలంలోని 27 మంది దివ్యాంగ (ప్రత్యేక అవసరాలు గల) పాఠశాల విద్యార్థులకు శుక్రవారం మండల విద్యాశాఖాధికారులు ఎంఈఓ కె. మహేశ్వర రెడ్డి , ఎస్. వెంకటేశ్వర నాయక్ చేతుల మీదుగా వివిధ రకాల సహాయక ఉపకరణాలను ఘనంగా పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన దివ్యాంగ పిల్లల అవసరాలకు అనుగుణంగా వీల్ చైర్స్, రోలేటర్లు, అంధ విద్యార్థులకు బ్రెయిలీ కిట్స్, అలాగే బుద్ధిమాంద్యం ఉన్న పిల్లల మానసిక వికాసానికి ఉపయోగపడే టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ టిఎల్ఎం కిట్లను ఈ సందర్భంగా అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థుల కోసం అందిస్తున్న ఈ పరికరాలను తల్లిదండ్రులు సక్రమంగా ఉపయోగించాలని కోరారు. వీటి సహాయంతో పిల్లలను రెగ్యులర్‌గా పాఠశాలలకు పంపించి, వారు ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భౌతిక లోపాలు చదువుకు అడ్డంకి కాకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకరణాలు అందుకున్న దివ్యాంగ పిల్లలు, వారి తల్లిదండ్రులతో పాటు ప్రత్యేక ఉపాధ్యాయులు: రమేష్ నాయుడు, ప్రసాద్ నాయుడు బీసీ స్కూల్ ఉపాధ్యాయులు, సీఆర్పీలు (సీపీస్ ): నవీన్, రామాంజనేయులు, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



## రుక్మిణి,పాండురంగస్వామికి 81 కళశాలతో ప్రత్యేక మండల పూజ



**పామిడి –సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలోని డబ్బిదార్ ఫిర్కా రుక్మిణి సమేత పాండురంగస్వామి ప్రతిష్ఠ అనంతరం శుక్రవారం మండల అభిషేక పూజలు, హోమాలు నిర్వహించారు.టీటీడీ వేద పండితులు కె ఎస్ ఆర్ ఆర్యా బృందం 81కళశాలని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.ఆశీతి స్నపన తిరుమంజన అభిషేకం, చేశారు.విస్తృత పంచామృత అభిషేకాలు, మండల హోమాలు చేశారు. భజనలు చేశారు. వంద లాది మంది భక్తులు హాజరై భక్తి ప్రపత్తుల తో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు అన్నదానం నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు జె. శ్రీనివాస రావు, ము కుంద రావు, కె. శ్రీనివాసరావు, రవీంద్రనాథ్, శేఖర్ భక్తాదులు తదిత పాల్గొన్నారు

## బాబు ష్యూరిటీ లేదు, భవిష్యత్తుకు గ్యారెంటీ లేదు
### - విజయోత్సవ సభలు పెట్టడానికి కూటమి ప్రభుత్వానికి సిగ్గుండాలి
### - మండల వైకాపా అధ్యక్షుడు దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి




**సింహాద్రిపురం – సూర్య వాస్తవం :** 2024 కూటమి ఎన్నికల వాగ్దానాలైనటువంటి బాబు షూరిటీ లేదు భవిష్యత్తుకు గ్యారెంటీ లేదని, విజయోత్సవ సభలు నిర్వహించడానికి కూటమి ప్రభుత్వానికి సిగ్గుండాలని సింహాద్రిపురం మండల వైకాపా అధ్యక్షుడు దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం పులివెందులలో నిర్వహించిన కూటమి ప్రభుత్వ రెండేళ్ల వెన్నుపోటు కార్యక్రమానికి సింహాద్రిపురం మండల పరిధిలోని వైకాపాశ్రేణులతో పులివెందులకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమై ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నదని వైకాపా శ్రేణులు ప్రజా వ్యతిరేకతను గమనించి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే విధంగా తమ కార్యాచరణ రూపొందించుకుని రానున్న స్థానిక ఎన్నికలలో విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలని కార్యకర్తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింహాద్రిపురం మండల వైకాపా నాయకులు మరియు శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను పెంచాలి

- విద్యాభివృద్ధికి తోడ్పడాలి
- జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**బెలుగుప్ప- సూర్య వాస్తవం :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను పెద్దఎత్తున చేర్పించి, ప్రభుత్వ విద్య బలోపేతానికి మరియు విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు.?వేసవి సెలవుల అనంతరం శుక్రవారం పాఠశాలలు పునఃప్రారంభం కాగా, బెలుగుప్ప మండలం కాలువపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లు, ఎన్రోల్మెంట్ ప్రక్రియను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. కొత్తగా ఎంతమంది విద్యార్థులు చేరారు? ఆరో, ఏడో తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్య ఎంత ఉంది? ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలకు ఎంతమంది విద్యార్థులు బదిలీపై వచ్చారు? తదితర వివరాలను పాఠశాల హెడ్మాస్టర్ సుధామనిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ మరియు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగ్గా ఉన్నాయి. అధికారులు, ఉపాధ్యా యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థుల నమోదును మరింత పెంచాలి. నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యా వ్యవస్థ అభివృద్ధికి తోడ్పాటునందించాలని జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ తనిఖీ కార్యక్రమంలో గుత్తి డివిజన్ ఎడ్యుకేషన్ అధి కారి లక్ష్మన్న, మండల విద్యాశాఖాధికారులు గోవిందరాజులు, హరికృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధామని, మండల డిప్యూటీ తహసీల్దార్, స్కూల్ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులు, ముస్లింలకు ఎస్సీ హోదా కల్పించాలి

- ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి యల్లయ్య
- ఎస్సీ హోదాపై బాలకృష్ణన్ కమిషన్‌కు సమగ్ర వినతిపత్రం సమర్పించినట్లు వెల్లడి

**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** దళిత క్రైస్తవులు మరియు దళిత ముస్లింలకు షెడ్యూల్డ్ కుల (ఎస్సీ) హోదాను విస్తరించాలని కోరుతూ ఈనెల 8వ తేదీన జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ కమిషన్‌కు ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించినట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి యల్లయ్య, వ్యవస్థాపకులు కొమ్ముపాలెం శ్రీనివాస్, రాష్ట్ర సలహాదారు దుర్గం సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ, దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలు మతమార్పిడి అనంతరం కూడా తమ కుల మూలాల కారణంగా సామాజిక, ఆర్థిక, విద్యా పరమైన వివక్షను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కులపరమైన అన్యాయాలు, అస్పృశ్యత ప్రభావాలు, సామాజిక బహిష్కరణలు కేవలం మతం మారినంత మాత్రాన అంతరించిపోవని దేశవ్యాప్తంగా జరిగిన అనేక అధ్యయనాలు, కమిషన్ నివేదికలు స్పష్టం చేశాయని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, గౌరవప్రద జీవితం, మత స్వేచ్ఛ హక్కులను కల్పిస్తుందని, అయితే 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వులోని పేరా--3 కారణంగా దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలు ఇప్పటికీ రాజ్యాంగ పరిరక్షణలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే కుల నేపథ్యం కలిగిన వ్యక్తుల్లో హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికి ఎస్సీ హోదా వర్తిస్తుండగా, క్రైస్తవులు మరియు ముస్లింలకు మాత్రమే నిరాకరించడం రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. మతం మారినంత మాత్రాన సామాజిక వాస్తవాలు మారిపోవని పార్లమెంట్ ఇప్పటికే గుర్తించిందని, అందుకే సిక్కు మరియు బౌద్ధ దళితులకు ఎస్సీ హోదా విస్తరించబడిందని గుర్తు చేశారు. జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ సైతం మతాన్ని ఎస్సీ గుర్తింపుకు ప్రమాణంగా పరిగణించకూడదని స్పష్టంగా సిఫారసు చేసిందని, సచార్ కమిటీతో పాటు అనేక సామాజిక అధ్యయనాలు దళిత క్రైస్తవులు, దళిత ముస్లింల వెనుకబాటుతనాన్ని నమోదు చేశాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ 2009, 2019, 2023 సంవత్సరాల్లో దళిత క్రైస్తవులు మరియు దళిత ముస్లింలకు ఎస్సీ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు ఆమోదించిందని గుర్తు చేశారు. ఇది కేవలం ఒక వర్గం డిమాండ్ మాత్రమే కాదని, సామాజిక న్యాయం రాజ్యాంగ విలువలకు సంబంధించిన అంశమని తెలిపారు. బాలకృష్ణన్ కమిషన్ దేశ సామాజిక వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని చారిత్రాత్మక సిఫారసు చేయాలని వారు కోరారు. 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వులోని మతపరమైన పరిమితిని తొలగించి, దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు ఎస్సీ హోదాతో పాటు రిజర్వేషన్లు, విద్యా అవకాశాలు, సంక్షేమ పథకాలు అన్ని రాజ్యాంగ పరిరక్షణలను విస్తరించాలని డిమాండ్ చేశారు. చారిత్రాత్మక అన్యాయానికి ముగింపు పలికి, రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వాన్ని ఆచరణలోకి తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని నాయకులు పేర్కొన్నారు. మతం కారణంగా హక్కులను నిరాకరించే పరిస్థితికి ముగింపు పలకాలని, సామాజిక న్యాయ స్ఫూర్తికి అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఏల్‌నినోను జయించడానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో నవధాన్యాల కిట్లు తయారీ



**వేముల - సూర్య వాస్తవం :** వేముల మండలం బెస్తవారిపల్లి గ్రామంలో శివమనోహర్ రెడ్డి బయో రీషోర్సు సెంటర్ నందు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి, ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ రామ్మోహన్ నాయుడు,, మాట్లాడుతూ ప్రస్తుత పంటల రసాయన వ్యవసాయం వలన భూమి సర్వంతాన్ని కోల్పోయి నిస్సారంగా మారిపోయింది కాబట్టి అందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా భూమికి పునర్జీవం పోయటానికి కోసం ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (నవధాన్యాలు)పద్ధతులలో ప్రతి ఒక్క రైతు తనకున్న పొలంలో రుతుపవనాల కంటే ముందుగా ఖాళీగా ఉన్న బీడు భూములన్నీ కూడా నవధాన్యాలను విత్తుకొని వాటిని 65 రోజుల పూత దశలో పశువులకు మేతగా ఉపయోగించి మిగిలిన వ్యర్త పదార్థాన్ని భూమిలోకి కలయిదున్నుకోవాలి భూమి సారవంతం పెరిగి ప్రధాన పంటకు కావాల్సిన అన్ని రకాల సూక్ష్మ స్థూల పోషకాలు మరియు కార్బన శాతం పెరుగుతుంది, బెస్తవారిపల్లి గ్రామం నందు శివమనోహర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం నందు 120 కిట్లు తయారుచేసి రైతులకు అందుబాటులో ఉంచడం జరిగింది కావాల్సిన రైతులు తీసుకువెళ్లాలని కోరుచున్నాము, మండల ఉపాధి హామీ అధికారి మాట్లాడుతూ ఇలాంటి పద్ధతులు వాడడం వల్ల భూమికి కావాల్సిన పోషకాలను అందిస్తూ మరియు పెట్టుబడిని తగ్గించుకుని మంచి దిగుబడి పొందవచ్చని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంచార్జ్ భాస్కర్ రెడ్డి, మండల ఇంచార్జి రామ్మోహన్ నాయుడు, యూనిట్ ఇంఛార్జిలు, కృష్ణయ్య,వెంకటేష్, అంజన్ రెడ్డి,ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ శివ మనోహర్ రెడ్డి, గ్రామ పెద్దలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఏజీఎస్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి ...!

- పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి వీరేంద్ర ప్రసాద్



**అనంతపురం - సూర్య వాస్తవం :** పిడిఎస్‌యు, ఏఐఎస్‌ఏ, ఏఐఎఫ్‌డిఎస్, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి వీరేంద్ర ప్రసాద్, ఐసా జిల్లా కన్వీనర్ బాలకృష్ణ, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సీఎం సిద్ధు మాట్లాడుతూ సవేరా హాస్పిటల్ దగ్గర ఉన్నటువంటి ఏజిఎస్ స్కూల్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఫీజుల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్న ఏ జి ఎస్ స్కూల్ పై ఇంతవరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు పైగా వేల రూపాయలను పుస్తకాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అధికారులు అండాదండతో లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేసిన అధికారులు పట్టించుకున్న పాపాను పోలేదు ఇదే విద్యా సంస్థకి అధికారులు తొత్తుగా మారినటువంటి పరిస్థితి కాబట్టి విద్యార్థి సంఘాలుగా ఒకటే హెచ్చరిస్తున్నాం. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఏ జీ ఎస్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి లేకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని తెలియజేస్తున్నాం అన్నారు.

# కూటమి ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ అమలను అటకెక్కించారు

- బివిఎస్ఆర్ ట్రాన్స్‌పోర్ట్ అధినేత బీవీ సుబ్బారెడ్డి



**పులివెందుల- సూర్య వాస్తవం :** సూపర్ సిక్స్ హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ అమలు పథకాన్ని అటకెక్కించి, అమరావతి అభివృద్ధి పేరుతో ప్రచార ఆర్భాటాలకు ప్రాధాన్యతరుస్తున్నారని బి వి ఎస్ ఆర్ ట్రాన్స్పోర్ట్ అధినేత బి.వి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి రాష్ట్ర వైకాపా ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, తొండూరు మండల ఇన్చార్జి వైఎస్ మదన్ మోహన్ రెడ్డి ల ఆధ్వర్యంలో పులివెందులలో జరిగిన కూటమి ప్రభుత్వ రెండేళ్ల వెన్నుపోటు కార్యక్రమానికి సుబ్బారెడ్డి నేతృత్వంలో వైకాపా శ్రేణులు తరలివచ్చి కూటమి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కొనసాగిన ర్యాలీ విజయవంతానికి తమ వంతు పాత్ర పోషించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని వదిలి ప్రధాని మోడీ భజన చేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను సమర్థిస్తూ పరిపాలన సాగించడం రానున్న రోజుల్లో వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి, జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీని విజయానికి చేరువ చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తొండూరు మండల వైకాపా నేతలు శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ రైల్వే ఇన్‌స్టిట్యూట్లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్ఎస్ లోనందు రైల్వే ఇన్సిట్యూ ట్ లో శు క్రవారం కేపీఎల్ గ్రూప్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇన్సిట్యూట్ ప్రెసిడెంట్ నబిరసూల్, సీనియర్ న్యాయవా ది నవీన్,కోచర్ మగి హాజరయ్యారు ఈ క్రికెట్ టోర్నమెంటు 12వ తారీకు నుండి 20వ తారీకు వరకు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ టోర్నమెంట్ నిర్వా హకులు తెలియజేశారు.20వ తా రీకు ఫైనల్ మ్యాచ్ జరుగునని అం దులో గెలుపొందిన క్రికెట్ జట్టుకు బ హుమతి ప్రధానం ఇవ్వడం జరుగుతుందని వారు తెలియజేశారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- ప్రతి శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్- ఐసీడీఎస్ పీడీ శశికళ వెల్లడి



**అనంతపురం - సూర్య వాస్తవం :** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అనంతపురం ఐసీడీఎస్ పీడీ శశికళ తెలిపారు. ఇదే అంశంపై ఐసీడీఎస్, అనుబంధ విభాగాల ఉద్యోగులతో శుక్రవారం విడివిడిగా సమావేశమై మాట్లాడారు. ఎక్స్ టెన్షన్ ఆఫీసర్ ఖాజీ రఫీమున్నీసా, డీసీపీఓ మంజునాథ్, అకౌంటెంట్ ఫాతిమా, ఐసీపీఎస్ ఐసీ వెంకటేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ శశికళ మాట్లాడుతూ.. ఐసీడీఎస్, అనుబంధ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ప్రతి శుక్రవారం తన ఛాంబర్ లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, సిబ్బంది తమ సమస్యలు ఏమైనా ఉంటే వినతిపత్రాల రూపంలో ఇస్తే పరిశీలించి తన పరిధిలో ఉన్న వాటిని సత్వరం పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తన పరిధిలో లేని వాటిని కలెక్టర్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఐసీడీఎస్‌లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సిఐ శ్రీకాంత్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు



**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం రూరల్ నూతన సిఐ శ్రీకాంత్ యాదవ్‌ను శుక్రవారం నాడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నెంబర్ చిన్న పెద్దన్న. ఎమ్మార్పీఎస్ గౌరాధ్యక్షులు చిన్నపల్లి ఓబులేసు, రాయలసీమ జిల్లాలు అధ్యక్షులు రమణ, నాయకులు నాగేష్ సత్యమయ్య సంజీవులు రామకృష్ణ, హనుమంతు, ఆకాష్, రామంజి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల వెన్నుపోటు

- కార్యక్రమానికి తరలిన నాలుగో వార్డు ప్రజలు



**పులివెందుల- సూర్య వాస్తవం :** పులివెందులలో శుక్రవారం నిర్వహించిన కూటమి ప్రభుత్వ రెండేళ్ల వెన్నుపోటు కార్యక్రమానికి పులివెందుల వైకాపా ఉపాధ్యక్షుడు వానపల్లి కిషోర్ ఆధ్వర్యంలో నాలుగో వార్డు ప్రజలు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శుక్రవారం జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి రాష్ట్ర వైకాపా ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, ఇతర నేతల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల వెన్నుపోటు విధానాలను నిరసిస్తూ పట్టణంలో భారీ ర్యాలీ కొనసాగగా కిషోర్ ఆధ్వర్యంలో నాలుగో వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కూటమి ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే ప్రయత్నం చేశారు.ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి మరియు సంక్షేమాన్ని విస్మరించి సుపరిపాలన సాగుతోందంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని వీటన్నింటిని ప్రజలు గమనిస్తున్నారని రానున్న స్థానిక ఎన్నికలలో కూటమి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు వైకాపా శ్రేణులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# టిడిపి, వైకాపాలు రాష్ట్రానికి రాహు-కేతువులు

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె – సూర్య వాస్తవం :** రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలైన టిడిపి, వైకాపాలు ప్రజలను మోసం చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి ఆటంకంగా మారాయని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విమర్శించారు. శుక్రవారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకాపా, టిడిపి ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని అన్నారు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని ఆరోపించారు. పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, డ్వాక్రా మహిళలు, నిరుద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. సూపర్ సిక్స్ హామీలు పూర్తిగా అమలు కాలేదని, ప్రత్యేక హోదా, పోలవరం, అమరావతి, రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి అంశాలు ముందుకు సాగడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రగతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, ప్రజలు మళ్లీ కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కమలాపురం నియోజకవర్గ సమన్వయకర్త మీగడ అశోక్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు గొడ్డెళ్ల ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

# రామసుబ్బారెడ్డి, నాగరాజులను పరామర్శించిన తులసి రెడ్డి





**వేంపల్లె – సూర్య వాస్తవం :** వేంపల్లెకు చెందిన లోమడ రామసుబ్బారెడ్డి ఇటీవల బెంగళూరులో రెండు మోకాళ్లకు శస్త్రచికిత్స చేయించుకుని స్వగృహానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న తులసి రెడ్డి, ఆయన త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం, అమర్‌నాథ్ రెడ్డి, ఉత్తన్న, చాగలేటి వెంకటేశు, చిన్నకోట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా వేంపల్లికి చెందిన బత్తల నాగరాజు తిరుపతిలో మూత్ర పిండాలకు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్న నేపథ్యంలో తులసి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆయనను కూడా పరామర్శించారు. నాగరాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# చేపల వేటకు వెళ్లి గుండెపోటుతో మత్స్యకారుడు మృతి

**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం :** మండల కేంద్ర పరిధిలో వున్న బ్రహ్మంసాగర్ (తెలుగు గంగ రిజర్వాయర్)కు బతుకు దెరువు కోసం చేపల వేటకు వెళ్లి గుండె పోటుతో మత్స్యకారుడు మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకెళితే బ్రహ్మం గారి మఠం మండల కేంద్రంలోని పాతూరు వీధికి చెందిన కందుకూరి పెద్ద చెన్నకేశవ(50) శుక్రవారం బ్రహ్మం సాగర్ లోకి చేపల వేటకు వెళ్లి గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వారి బంధువులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, వైద్యాధికారి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు ఆయన తెలియజేశారు. మృతుడికి భార్య ముగ్గురు ఆడపిల్లలు, వున్నారు. భార్య కూడా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది, కుటుంబ యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబానికి దిక్కులేని పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎఫ్‌డీఓలు బాల రాజు, కిరణ్ కుమార్ అధికారులు ఆసుపత్రికు వచ్చి పెద్ద కేశవులు మృతదేహాన్ని చూసి ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్‌లు మృతుని కుటుంబానికి వచ్చే విధంగా చేస్తామని అని అన్నారు.



# మహిళల భద్రతే ముఖ్యం....శక్తి టీమ్...!

**- "శక్తి టీమ్స్" విస్తృత అవగాహనలు**



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్, తాడిపత్రి, గుంతకల్లు, మరియు కళ్యాణదుర్గం సబ్ డివిజన్ల శక్తి బృందాలు ఆర్టీసీ బస్టాండ్లు, విద్యా సంస్థలు, వ్యాపార సముదాయాలు, తదితర ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించాయి. శక్తి యాప్ డౌన్‌లోడ్: మహిళల రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన 'శక్తి యాప్'ను ప్రతి ఒక్కరూ తమ మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విపత్కర పరిస్థితుల్లో ఈ యాప్ ఎలా ఉపయోగపడుతుందో మహిళలకు ప్రాక్టికల్‌గా వివరించారు.

**మహిళలు, చిన్నారుల రక్షణ:** సమాజంలో మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా వేధింపులకు గురైతే వెనుకాడకుండా ఎలా స్పందించాలో అవగాహన కల్పించారు.

**అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు:** ప్రమాద సమయాల్లో తక్షణ సహాయం కోసం డయల్ 100 / 112, బాలల రక్షణ కోసం 1098, మహిళల సహాయం కోసం 181 నంబర్లను ఎలా సంప్రదించాలో వివరించారు. సైబర్ నేరాలు, ఏటీఎం మోసాలు: ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలు, ఏటీఎం మోసాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఫేక్ కాల్స్, ఓటీపీ జాగ్రత్తలు: బ్యాంకుల పేరుతో వచ్చే నకిలీ (ఫ్రాడ్) ఫోన్ కాల్స్ నమ్మవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ మీ బ్యాంక్ వివరాలు, పిన్ నంబర్ లేదా ఓటీపీ లను ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. సమాజాన్ని పీడిస్తున్న గంజాయి, తదితర మత్తు పదార్థాల మహమ్మారి వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, వాటికి దూరంగా ఉండాలని యువతకు, మహిళలకు పిలుపునిచ్చారు.

# అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం :** మండలంలోని అంగన్వాడి పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఓ జహ్రాబి ఓ ప్రకటనలో తెలిపారు. లక్కిరెడ్డిపల్లి ని 8 అంగనవాడి సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. 21 సంవత్సరాల ఉండి 10వ తరగతి పాస్ అయి ఉండాలని పదవ తరగతి మార్కులు మెరిట్ ప్రకారం నియమితులుగుతారని ఆమె తెలియజేశారు. దిగువ బత్తిన వారి పల్లి (బీసీ'ఏ) గాండ్లపల్లి (బిసిబిడి) గురవయ్యాగారి పల్లి (బిసిబిబి) కృష్ణాపురం విహెచ్ (వికలాంగులకు ) ముని రెడ్డిగారిపల్లి (డిసిబిడి) నందివాళ్ళపల్లి (హెచ్ హెచ్ కి సంబంధించిన) (వికలాంగురాలు) సెంటర్లకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఈనెల 12వ తేదీ నుంచి 24 తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పూర్తి చేసిన దరఖాస్తులు స్థానిక ఐసిడిఎస్ కార్యాలకు అప్పజెప్పాలన్నారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ శ్రేణులు

**- ఇడుపులపాయి పోతిరెడ్డి మహేష్ ఆధ్వర్యంలో పులివెందులకు తరలిన కార్యకర్తలు**



**వేంపల్లె – సూర్య వాస్తవం :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పులివెందులలో నిర్వహించిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమానికి ఇడుపులపాయి యువజన అధ్యక్షులు పోతిరెడ్డి మహేష్ ఆధ్వర్యంలో ఇడుపులపాయి నుంచి వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడం, మేనిఫెస్టోను విస్మరించడం, ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కార్యకర్తలు బయలుదేరారు. "ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం" అని పోతిరెడ్డి మహేష్ పేర్కొన్నారు. పులివెందులలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు.ఈ కార్యక్రమంలో సాయినాథ్, హనుమంతు, రామసుబ్బయ్య, శ్రీరాములు, సంటెన్న తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నాయకుడు తోపదుర్తి శంకరప్ప మృతి

**- నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్ రెడ్డి**



**కూడేరు– సూర్య వాస్తవం:** కూడేరు గ్రామానికి చెందిన ప్రముఖులు శ్రీ తోపదుర్తి శంకరప్ప (68) మరణించడం పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశాయి. శంకరప్ప మరణవార్త తెలుసుకున్న ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జ్, పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్ రెడ్డి వెంటనే వారి నివాసానికి చేరుకున్నారు. శంకరప్ప భౌతిక కాయానికి పూలమాల వేసి విశ్వేశ్వర్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా వై. విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ శంకరప్ప మరణం వారి కుటుంబానికి మరియు పార్టీకి తీరని లోటు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ పెద్ద విషాదాన్ని తట్టుకునే శక్తిని ఆ దేవుడు వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానుఅని పేర్కొన్నారు. తరలివచ్చిన నాయకులు ఈ కార్యక్రమం లో విశ్వేశ్వర్ రెడ్డితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి -- సంక్షేమం"

**- విజయోత్సవ సభలో జనసేన శ్రేణుల ఉత్సాహభరిత పాల్గొనడం**

**- జిల్లా కార్యదర్శి అల్లం బాబు సమక్షంలో కోట--వాకాడు ప్రాంతాల నుంచి భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు**



**నాయుడుపేట – సూర్య వాస్తవం:** తిరుపతిలో ఘనంగా నిర్వహించిన "2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి -- సంక్షేమం" విజయోత్సవ సభకు కోట, వాకాడు ప్రాంతాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కూటమి ప్రభుత్వానికి తమ మద్దతును ప్రకటించారు. జిల్లా కార్యదర్శి అల్లం బాబు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ కీలక నాయకులు ముని గిరీష్, ఇంద్రనీల్, మున్నా, చంద్ర, సతీష్‌లతో పాటు వారి బృంద సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, మహిళా సాధికారత వంటి అంశాలపై కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో సాధించిన విజయాలను ఈ సభలో నాయకులు వివరించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగుతుండడం వల్ల రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని అన్నారు. సభలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మరింత కృషి చేయాలని సంకల్పించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేర్చేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోట, వాకాడు ప్రాంతాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సభ విజయవంతం కావడంలో తమ వంతు పాత్ర పోషించారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు: ఉరవకొండలో వైసీపీ భారీ నిరసన ర్యాలీ




**ఉరవకొండ – సూర్య వాస్తవం :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తైన సందర్భంగా వైఎస్సార్సీపీ చేపట్టిన "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమంలో భాగంగా ఉరవకొండ పట్టణంలో గురువారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మార్కండేయ స్వామి ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వై. విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పర్యవేక్షకుడు వైసీ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు గుర్తు చేసే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అనంతరం వై. విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, సూపర్ సిక్స్‌తో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగులు, మహిళలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని అన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే పోలీసు వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు లోనవుతోందని, ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న మాట్లాడుతూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, కార్యకర్తలు మరియు మీడియా ప్రతినిధులకు పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు, మండల అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ప్రజాసంఘాల నాయకులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# ‘పెద్ది’ని తొక్కేయడానికి కొందరు కావాలనే అడ్డుపడుతున్నారు: జగపతిబాబు ఫైర్

**-‘పెద్ది’ సినిమాలో చరణ్ పోరాడి గెలిచాడన్న జగపతిబాబుతొలి మూడు రోజులు కలెక్షన్లు ఆశించిన స్థాయిలో లేవని వెల్లడిఇప్పుడు టాక్ పూర్తిగా మారిపోయిందన్న జగ్గూ భాయ్**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో వచ్చిన ‘పెద్ది’ సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియాలో వస్తున్న నెగిటివిటీని తట్టుకుని, బాక్సాఫీస్ వద్ద బలమైన టాక్‌తో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో సీనియర్ నటుడు జగపతిబాబు, దర్శకుడు బుచ్చిబాబుల మధ్య జరిగిన ఒక ఆసక్తికర సంభాషణ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో ఒక అద్భుతమైన పాత్రను పోషించిన జగపతిబాబు, సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నారు. ‘పెద్ది’ చిత్రం తెలుగు చిత్ర పరిశ్రమకు సరికొత్త ఊపిరి పోస్తుందంటూ గతంలో తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని జగపతిబాబు చెప్పారు.

ఈ సినిమా ప్రయాణం గురించి ఆయన మాట్లాడుతూ.. “ఈ సినిమాలో చరణ్ ఒక ఆట ఆడాడు, కష్టపడి పోరాడి గెలిచాడు. కానీ దురదృష్టవశాత్తూ నేటి పరిశ్రమలో గెలిచిన తర్వాత కూడా ఇంకా పోరాడుతూనే ఉండాల్సి వస్తోంది” అని ఆవేదన వ్యక్తం చేశారు. రామ్ చరణ్‌పై ప్రశంసలు కురిపిస్తూ.. ‘చరణ్ ప్రతి షాట్‌లోనూ సిక్సర్ కొట్టాడు’ అని కొనియాడారు. సినిమాను తొక్కేయడానికి కొందరు కావాలనే ప్లాన్డ్ నెగిటివిటీని ప్రచారం చేస్తున్నారని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలిరోజుల్లో వచ్చిన బాక్సాఫీస్ రెస్పాన్స్‌పై జగపతిబాబు ఓపెన్‌గా స్పందించారు.

మొదట రెండు మూడు రోజులు కలెక్షన్లు ఆశించిన స్థాయిలో లేవని, అసలైన ప్రేక్షకులు థియేటర్లకు పూర్తి స్థాయిలో రాలేదని అంగీకరించారు. అయితే రోజులు గడిచేకొద్దీ మౌత్ టాక్ మారిపోయిందన్నారు. “ఇప్పుడు టాక్ పూర్తిగా పాజిటివ్‌గా మారింది. ఫ్యామిలీ ఆడియన్స్ భారీగా థియేటర్లకు వస్తున్నారు. సినిమా ఇంత బాగుంటే, కొందరు ఎలా ఇంత నెగిటివ్ ప్రచారం చేశారో అర్థం కావడం లేదని కొందరు నాతో అన్నారు” అని చెప్పారు. స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వయంగా నిర్మించిన చిత్రం ‘మా ఇంటి బంగారం’ విడుదలకు సిద్ధమైంది. తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం ‘యు/ఏ’ సర్టిఫికెట్‌ను పొందింది. ఈ యాక్షన్ ఫ్యామిలీ డ్రామాను 2026, జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు విశేష స్పందన లభించడంతో, చిత్ర యూనిట్ ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. బి.వి. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సమంత తన సొంత నిర్మాణ సంస్థ ‘ట్రలాలా మూవింగ్ పిక్చర్స్’ బ్యానర్‌పై రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరులతో కలిసి సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమాలో గుల్షన్ దేవయ్య, దిగంత్ మంచాలే, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు.



## దర్శకుడి ఆరోపణలపై స్పందించిన నటి వరలక్ష్మీ శరత్‌కుమార్

**రేపు విడుదల అవుతున్న వరలక్ష్మి ‘పోలీస్ కంప్లైంట్’ చిత్రం ప్రమోషన్స్ కు వరలక్ష్మి సహకరించలేదన్న దర్శకుడు అవసరమైనప్పుడల్లా తాను అందుబాటులో ఉన్నానన్న వరలక్ష్మి**



తనపై దర్శకుడు సంజీవ్ మేగోటి చేసిన ఆరోపణలను నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ తిప్పికొట్టారు. ఆయన దర్శకత్వంలో ఆమె నటించిన ‘పోలీస్ కంప్లైంట్’ చిత్రం జూన్ 12న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్ కు వరలక్ష్మి సహకరించలేదని, డబ్బులు తీసుకొని కూడా ఇంటర్వ్యూలు ఇవ్వకపోవడం వల్ల భారీ నష్టం వాటిల్లిందని దర్శకుడు ఇటీవల ఆరోపించారు. ఈ వివాదంపై వరలక్ష్మి స్పందిస్తూ... చిత్ర బృందానికి అవసరమైనప్పుడల్లా తాను అందుబాటులోనే ఉన్నానని, సినిమాకు సంబంధించిన వేడుకల్లో పాల్గొన్నానని స్పష్టం చేశారు. వేదికపై దర్శకుడు ఏం మాట్లాడారో తనకు పూర్తిగా తెలియదన్నారు. కొన్ని విషయాల్లో తనకంటూ సొంత అభిప్రాయాలు ఉంటాయని, అందుకే చిత్రబృందం చేస్తున్న ఆరోపణల గురించి బహిరంగంగా చర్చించి వివాదాన్ని పెద్దది చేయడం ఇష్టం లేదని తెలిపారు. తాను అందరిలా ఆరోపణలు చేయలేనని పేర్కొన్నారు. తన పని తాను చూసుకుంటూ ముందుకు వెళతానని ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన నోట్ ద్వారా స్పష్టం చేస్తూ ఈ వివాదానికి చెక్ పెట్టే ప్రయత్నం చేశారు.



# ప్రపంచకప్ గెలవాలంటే రోహిత్, కోహ్లీ కీలకం: ఇర్ఫాన్ పఠాన్

- ప్రపంచకప్‌లో భారత్‌కు రోహిత్, కోహ్లీ అనుభవం కీలకమన్న ఇర్ఫాన్ పఠాన్
- దక్షిణాఫ్రికాలో రోహిత్ షార్ట్‌పిచ్ బంతులను సమర్థంగా ఎదుర్కోగలడని విశ్లేషణ
- వన్డేల్లో ఇన్నింగ్స్‌ను నిర్మించడంలో కోహ్లీకి సాటే లేదని అభిప్రాయం
- వికెట్‌కీపర్‌గా కేఎల్ రాహుల్ తర్వాత ఇషాన్ కిషన్ బ్యాకప్ అని పేర్కొన్న పఠాన్



దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచకప్‌లో భారత్ విజయావకాశాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అనుభవంపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటాయని మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో తొలి వన్డేకు ముందు మాట్లాడిన అతడు ఈ ఇద్దరు సీనియర్ బ్యాటర్లు జట్టుకు అందించే స్థిరత్వం, ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం విలువైనవని పేర్కొన్నాడు. ప్రపంచకప్ వంటి భారీ టోర్నీల్లో అనుభవజ్ఞుల పాత్ర ఎంత ముఖ్యమో భారత్ గతంలో పలుమార్లు చూసిందని గుర్తు చేశాడు. రోహిత్ శర్మ గురించి మాట్లాడిన పఠాన్, అతని షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కొనే నైపుణ్యాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించాడు. దక్షిణాఫ్రికా పిచ్‌లపై వేగం, బౌన్స్ ఎక్కువగా ఉంటాయని, అలాంటి పరిస్థితుల్లో రోహిత్ వంటి బ్యాటర్ ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం చెలాయించగలడని అన్నాడు. బాల్ లెంగ్త్‌ను ముందుగానే అంచనా వేసి ఆడే అతని సామర్థ్యం భారత జట్టుకు పెద్ద బలమని వివరించాడు. విరాట్ కోహ్లీ విషయానికి వస్తే వన్డే క్రికెట్‌లో అతని స్థిరత్వానికి సాటే లేదని పఠాన్ పేర్కొన్నాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే కోహ్లీ తొలి వికెట్ త్వరగా పడినప్పుడు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దగలడని చెప్పాడు. భారీ లక్ష్యాల ఛేదనలో కోహ్లీ ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడని వివరించాడు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడే అతని స్వభావం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపాడు. ప్రపంచకప్ గెలవాలంటే రోహిత్ దూకుడు, కోహ్లీ నిలకడ రెండూ భారత్‌కు తప్పనిసరిగా అవసరమని స్పష్టం చేశాడు. ఇక వికెట్‌కీపర్ బ్యాటర్ల ఎంపికపై కూడా పఠాన్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. వన్డేల్లో కేఎల్ రాహుల్ భారత జట్టు తొలి ఎంపిక వికెట్‌కీపర్ బ్యాటర్ అని చెప్పాడు. ఐదు, ఆరు స్థానాల్లో అతను జట్టుకు బ్యాలెన్స్‌ను అందించగలడని వివరించాడు.

బ్యాకప్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేయడం సరైన నిర్ణయమని తెలిపాడు. ఫాస్ట్ బౌలింగ్‌ను ఎదుర్కొనే సామర్థ్యం అతనికి ఉందని తెలిపాడు. అలాగే అవకాశం వచ్చిన ప్రతిసారీ సత్తా చాటిన సంజూ శాంసన్‌ను కూడా పరిశీలించొచ్చని సూచించాడు.




## ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లోకి దూసుకెళ్లిన పివి.సింధు

సిడ్నీ : రెండుసార్లు ఒలింపిక్ పతకాలను అందుకున్న విజేత పివి.సింధు .... శుక్రవారం సిడ్నీలో జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో వరుస గేమ్‌లలో తిరుగులేని విజయంతో మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్‌లోకి దూసుకెళ్లింది. కేవలం 27 నిమిషాల్లోనే ఏకపక్షంగా సాగిన క్వార్టర్-ఫైనల్ పోరులో, మూడో సీడ్ క్రీడాకారిణి అయిన ఈ భారత క్రీడాకారిణి చైనీస్ తైపీకి చెందిన చెన్ సు యూను 21-6, 21-9 తేడాతో చిత్తుగా ఓడించింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ అయిన సింధు తదుపరి పోరులో జపాన్‌కు చెందిన టాప్ సీడ్ అకానె యమగుచితో తలపడనుంది. యమగుచి, 32 నిమిషాల్లో జరిగిన పోరులో 21-14, 21-14 తేడాతో భారత యువ క్రీడాకారిణి తన్వి శర్మ అద్భుత ప్రదర్శనకు ముగింపు పలికింది. యాదృచ్ఛికంగా, ప్రపంచ నెం. 3 జపనీస్ క్రీడాకారిణిపై సింధు 15-13 స్వల్ప హెడ్-టు-హెడ్ ఆధిక్యాన్ని సాధించింది. సింధు తన మెరుగైన రీచ్, కోర్ట్ కవరేజీని ఉపయోగించి, ప్రత్యర్థిపై నిరంతరం ఒత్తిడి తెస్తూ, ఆరంభం నుంచే ఆటపై ఆధిపత్యం చెలాయించింది. ఆమె తొలి గేమ్‌ను వేగంగా గెలుచుకుని, రెండో గేమ్‌లో కూడా అదే జోరును కొనసాగించి చివరి నాలుగు స్థానాల్లో తన స్థానాన్ని ఖరారు చేసుకుంది. ఈ సీజన్‌లో నిలకడలేని ప్రదర్శన కనబరుస్తూ, దీఔఖీ వరల్డ్ టూర్‌లో లయ కోసం అన్వేషిస్తున్న డిసెంబర్ 2024లో జరిగే సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ తర్వాత తన మొదటి టైటిల్ కోసం ఎదురుచూస్తున్న సింధుకు సెమీ-ఫైనల్‌కు చేరడం ఒక ముఖ్యమైన ఊరట. అంతకుముందు, ప్రీ-క్వార్టర్ ఫైనల్స్‌లో తన దేశస్థురాలైన ఇషారానీ బారువాను ఓడించి సింధు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది.

# ఇంకా ఏదీ ఖరారు కాలేదు

- ట్రంప్ ఒప్పందం ప్రకటనను తోసిపుచ్చిన ఇరాన్
- ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి
- ఎలాంటి తుది నిర్ణయమూ తీసుకోలేదని స్పష్టీకరణ

**వాషింగ్టన్, టెహ్రాన్ –సూర్య వాస్తవం :** అమెరికా అధ్యక్ష?్నడు డోనాల్డ్ ట్రంప్.. ఇరాన్‌తో జరుగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికే ఒప్పందం త్వరలోనే కుదిరే అవకాశముందని ప్రకటించినప్పటికీ ఆ విషయాన్ని ఇరాన్ తోసిపుచ్చింది. చర్చలు కొనసాగుతున్నాయనీ, అయితే ఇంకా ఎలాంటి తుది నిర్ణయమూ తీసుకోలేదని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి స్పష్టం చేశారు. దీంతో మధ్యప్రాచ్యంలో ఇప్పటికీ అనిశ్చితి కొనసాగుతోంది.




### ట్రంప్ ఏమన్నారు?

ఇరాన్‌పై మరోసారి భారీ సైనిక దాడులు చేయాలని అమెరికా సిద్ధమైందని హెచ్చరించిన ట్రంప్.. అనంతరం చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని చెప్పారు. "ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలు తయారు చేయకూడదన్నదే మా ప్రధాన లక్ష్యం. ఆ దిశగా గొప్ప ఒప్పందం కుదిరే దశలో ఉంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఒప్పంద పత్రాలు దాదాపు సిద్ధంగా ఉన్నాయనీ, కొన్ని రోజుల్లోనే వాటిపై సంతకాలు జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. యూరప్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశముందని కూడా వెల్లడించారు. ఇరాన్ సుప్రీం లీడర్ కూడా ఈ ఒప్పందాన్ని ఆమోదించారని ట్రంప్ ధృవీకరించారు. ఒప్పందంపై సంతకాలు పూర్తి కాగానే ఇరాన్‌పై ఉన్న దిగ్బంధాన్ని అమెరికా తక్షణమే ఎత్తివేస్తుందని, దీనివల్ల చమురు ధరలు భారీగా పడిపోతాయని అంచనా వేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ ఒప్పందం ప్రకారం అణు ఆయుధాలను అభివృద్ధి చేయబోమని, వాటిని కలిగి ఉండబోమని ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ చెప్పడం గమనార్హం. ఇరాన్‌తో కుదిరే ఈ అధికార ఒప్పందం పూర్తయ్యే వరకు అమెరికా, మిత్రదేశాలు అమలు చేస్తున్న నౌకాదళ దిగ్బంధం (నావల్ బ్లాకేడ్) యథావిధిగా కొనసాగుతుందని ట్రంప్ తన సోషల్‌ట్రూత్‌లో స్పష్టం చేశారు. తుది ఒప్పంద పత్రాలపై సంతకాలకు సంబంధించిన తేదీ, ప్రదేశ వివరాలను త్వరలో ప్రకటిస్తామని ఆయన వివరించారు.

### ఇరాన్ స్పందన

అయితే ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ జాగ్రత్తగా ఖండించింది. ఒప్పంద ముసాయిదాలో ఎక్కువ భాగం సిద్ధమైనప్పటికీ, అమెరికా చివరి నిమిషంలో కొత్త డిమాండ్లు పెడుతోందని బఘాయి ఆరోపించారు. తమ "రెడ్ లైన్స్" నుంచి వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. ఇరాన్ ప్రధానంగా తన అణు కార్యక్రమంపై అధిక పరిమితులను అంగీ కరించేందుకు సిద్ధంగా లేదనే సంకేతాలు ఇస్తోంది. అలాగే క్షిపణి కార్యక్రమం, ప్రాంతీయ మిత్ర బలగాలకు మద్దతు వంటి అంశాల్లో కూడా రాజీకి ఆస్కారం తక్కువగా కనిపిస్తోంది.

### కొనసాగుతున్న ఉద్రిక్తతలు

ఒప్పంద చర్చలు జరుగుతున్నప్పటికీ, మధ్యప్రాచ్యంలో పరిస్థితులు మాత్రం ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. అమెరికా, ఇరాన్ ఒకదానిపై ఒకటి దాడులు చేసుకుం – టున్నాయి. దక్షిణ ఇరాన్‌లోని రాడార్, నిఘా కేంద్రాలపై అమెరికా దాడులు చేయగా, ప్రతిగా బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. కాగా ట్రంప్ ప్రకటనల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు ఒక్కసారిగా తగ్గాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు 89 డాలర్లకు పడిపోయి, ఒక్క రోజులోనే 4.4 శాతం క్షీణించింది. హోర్ముజ్ జలసంధి మళ్లీ పూర్తిగా తెరుచుకుం టుందనే ఆశలు ఇందుకు కారణమ య్యాయి. ప్రపంచ చమురు, సహజ వాయువు రవాణాలో కీలకమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ దాదాపు మూసివేయ డంతో గత కొన్ని నెలలుగా అంతర్జాతీయ వాణిజ్యం తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కొంటున్న విషయం విదితమే.

### అమెరికా––ఇరాన్ వైఖరులు

అమెరికా ప్రధానంగా ఇరాన్ అణ్వాయుధాల అభివృద్ధిని పూర్తిగా విరమించుకోవాలని కోరుతోంది. అలాగే యురేనియం నిల్వలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని, హోర్ముజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానానికి హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. అదే సమయంలో నౌకలపై టోల్ వసూలు చేసే హక్కు, జలసంధిపై పూర్తి సైనిక నియంత్రణ, మధ్యప్రాచ్యం నుంచి అమెరికా బలగాల సంపూర్ణ ఉపసంహరణ వంటి డిమాండ్లను వాషింగ్టన్ తిరస్క రిస్తోంది. మరోవైపు ఇరాన్ మరింత విస్తృత స్థాయిలో ఆర్థిక ఆంక్షల సడలింపు, విదేశాల్లో నిల్వ ఉన్న ఆస్తుల విడుదల, భవిష్యత్తులో సైనిక దాడులు జరగబోవన్న హామీ, అంతర్జాతీయ భద్రతా హామీలను కోరుతోంది. కాగా మధ్యవర్తులు ఒప్పందంలోని చివరి అంశాలను ఖరారు చేసే పనిలో ఉన్నారు. ఇరు దేశాలు గతంలో ఎన్నడూ లేనంతగా ఒప్పందానికి దగ్గరైనప్పటికీ, దీనికి ఇంకా అధికారిక ఆమోదం అవసరమని సంబంధిత వర్గాలు చెప్తున్నాయి. అయితే ఈ ఒప్పందం అమలులోకి వస్తే మధ్యప్రాచ్యంలో గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ఫుల్‌స్టాప్‌పడి గణనీయమైన ఉపశమనం లభించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### 60 రోజుల కాల్పుల విరమణ

ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం అమెరికా, ఇరాన్ దేశాలు ప్రస్తుతం అమల్లో ఉన్న కాల్పుల విరమణను మరో 60 రోజుల పాటు పొడిగిస్తాయి. శాశ్వత ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్న సమయంలో పరస్పర అంగీకారంతో ఈ గడువును మరింత పొడిగించే అవకాశం ఉంటుంది. ఈ వ్యవస్థ ద్వారా సైనిక ఉద్రిక్తతలకు అడ్డుకట్ట వేసి, దౌత్యపరమైన చర్చలకు అనుకూల వాతావరణం కల్పించాలన్నది ప్రధాన ఉద్దేశం.

### హోర్ముజ్ జలసంధి పున:ప్రారంభం

ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని ఒప్పందంపై సంతకాలు జరిగిన వెంటనే తిరిగి తెరవాలని ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. ఈ జలమార్గంలో వాణిజ్య నౌకల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులూ ఉండవనీ, ఎలాంటి టోల్ ఫీజులూ, రవాణా రుసుములూ విధించబోమని ఇరాన్ హామీ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఘర్షణల సమయంలో సముద్రంలో అమర్చిన మైన్లను తొలగించి, సురక్షిత నౌకాయానాన్ని పునరుద్ధరించనుంది. ఒప్పందం అమల్లోకి వచ్చిన 30 రోజుల్లోనే యుద్ధానికి ముందు ఉన్న స్థాయికి నౌకా రవాణా చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు.

### భారత్ ఆందోళన

గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో అమెరికా దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనకు సంబంధించి అమెరికా సీనియర్ దౌత్యవేత్తను పిలిపించి వివరణ కోరింది. మరో 21 మంది సిబ్బందిని రక్షించారు. ఇక మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ దేశాలు శాంతికి పిలుపునిచ్చాయి. పరిస్థితి మరింత దిగజారకుండా చూడాలని ఐక్యరాజ్యసమితి (యూఎన్) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ పిలుపునిచ్చారు. భారత్, చైనా, రష్యా, సౌదీ అరేబియా, పాకిస్తాన్, టర్కీ వంటి దేశాలు కూడా ఉద్రిక్తతలను తగ్గించాలని కోరాయి.

### ఆ ఒప్పందం ఏమిటి?

ఒప్పందం విషయంలో ఇటు అమెరికా నుంచి, అటు ఇరాన్ నుంచి భిన్నమైన ప్రకటనలు వెలువడ్డాయి. అయితే చర్చల్లో పాల్గొంటున్న అధికారుల సమాచారం ప్రకారం ఇరు దేశాలు 60 రోజుల కాల్పుల విరమణకు, భవిష్యత్ సమగ్ర ఒప్పందానికి పునాది వేసేలా అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై విస్తృతంగా ఏకాభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

### అమెరికా నుంచి ఆర్థిక సడలింపులు

ఇక ఒప్పందంలో భాగంగా అమెరికా.. ఇరాన్ పోర్టులపై విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయనుంది. అలాగే కాల్పుల విరమణ కాలంలో ఇరాన్ మళ్లీ చమురు ఎగుమతులు ప్రారంభించుకునేందుకు ఆంక్షల సడలింపులను ప్రకటించనుంది. ఇకపై ఇరాన్ ఒప్పంద నిబంధనలను పాటించే విధానాన్ని బట్టి మరిన్ని ఆర్థిక ఆంక్షలను సడలించే అవకాశం ఉంటుంది. విదేశాల్లో నిల్వ ఉన్న ఇరాన్ ఆస్తులను విడుదల చేసే అంశంపై కూడా చర్చలు కొనసాగుతున్నాయి.

### అణు కార్యక్రమంపై కీలక నిబంధనలు

ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన అంశం ఇరాన్ అణు కార్యక్రమమే. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోదని అధికారికంగా ప్రకటించాల్సి ఉంటుంది. యురేనియం శుద్ధీకరణ కార్యక్రమాన్ని నిలిపివేసే అంశంపై చర్చలకు అంగీకరించాల్సి ఉంటుంది. అధిక స్థాయిలో శుద్ధి చేసిన యురేనియం నిల్వల భవిష్యత్తుపై తదుపరి చర్చల్లో నిర్ణయం తీసుకోనున్నారు. ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణలో వాటిని తక్కువ స్థాయికి మార్చడం లేదా మూడో దేశానికి తరలించడం వంటి ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి.

# ఊపందుకుంటున్న జెన్ జెడ్ ఉద్యమాలు

- ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలు
- పెరుగుతున్న ఆర్థిక ఒత్తిళ్ల నేపథ్యంలో ఇండోనేషియాలో విద్యార్థుల నిరసన
- ఇంధనం, ఆహార ధరలు తగ్గించాలని డిమాండ్



**జకార్తా–సూర్య వాస్తవం :** నేపాల్, శ్రీలంక తో పాటు పలు దేశాల్లోనూ జెన్ జెడ్ ఉద్యమాలు ఊపందుకుంటున్నాయి. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు రోడ్లపైకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేపడుతున్నారు. తాజాగా ఇండోనేషియా రాజధాని జకార్తాలో పెరుగుతున్న ఆర్థిక ఒత్తిళ్ల నేపథ్యంలో ఇంధనం , ఆహార ధరలను తగ్గించాలని గళమెత్తారు. ఖరీదైన ప్రభుత్వ వ్యయ కార్యక్రమాలను వెనక్కి తీసుకోవాలని అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోను కోరుతూ జకార్తాలో శుక్రవారం విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం నమాజ్ అనంతరం, నిరసనకారులు నగరంలోని ఒక ముఖ్య ప్రదేశమైన హోటల్ ఇండోనేషియా ట్రాఫిక్ సర్కిల్ వైపు కవాతు చేయడానికి ప్రయత్నించారు. అధికారులు వారిలో చాలా మందిని అడ్డుకున్నారు . అధ్యక్ష భవనానికి దారితీసే వీధులను కూడా మూసివేశారు. అక్కడ ఆరుగురికి పైగా పోలీసులు , సైనికులను మోహరించారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధం ప్రారంభించినప్పటి నుంచి పెరిగిన ఇంధన ధరల ఫలితంగా జీవన వ్యయాలు పెరిగాయని నిరసనకారులు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. వారిలో చాలామంది పసుపు రంగు యూనివర్సిటీ జాకెట్లు ధరించారు.

### ప్రభుత్వ వైఫల్యంపై ఆగ్రహం

ప్రభుత్వ వ్యయాలలో వృథాగా కోతలు, ఇంధన ధరలు, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించడం, ఉచిత పౌష్టికాహార పథకం , గ్రామీణ ప్రాంతాల పునరుజ్జీవన ప్రణాళిక వంటి ప్రధాన ప్రభుత్వ కార్యక్రమాలను నిలిపివేయడం వంటి ఐదు కీలక డిమాండ్లను నిరసనకారులు వివరించారు. ఈ ఒక్క సంవత్సరంలోనే సుమారు 268 ట్రిలియన్ రూపియాలు (15 బిలియన్ డాలర్లు) ఖర్చయ్యే ఈ ఉచిత భోజన కార్యక్రమం, పేదరికం , పోషకాహార లోపాన్ని తగ్గించే లక్ష్యంతో ఉంది. అయితే, భారీ అవినీతి విచారణ నేపథ్యంలో ప్రబోవో ఇటీవల ఈ కార్యక్రమ అధిపతిని తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రస్తుత పరిస్థితిని ప్రభుత్వం అంగీకరించడం లేదు " అని ర్యాలీని నిర్వహించిన విద్యార్థి సంఘానికి అధ్యక్షత వహిస్తున్న యటలాతోఫ్ మాషుమ్ ఇమావాన్ అన్నారు. "ప్రబోవో తన తప్పును ఒప్పుకుని, దానిని కాదనడం మానేసే ధైర్యం చేయాలని మేము కోరుతున్నాం." అని యువ నేతలు తెలిపారు. గత ఆగస్టులో దేశవ్యాప్త నిరసనలు చెలరేగి, వేలాది మంది వీధుల్లోకి రావడం, భద్రతా దళాలతో జరిగిన ఘర్షణల్లో కనీసం 13 మంది మరణించిన విషయం విదితమే. అతిపెద్ద విద్యార్థి సమీకరణలలో శుక్రవారం నాటి ప్రదర్శన ఒకటి. అని విద్యార్థి సంఘాలు తెలిపాయి. ఇలాంటి నిరసనలు పశ్చిమ జావాలోని బండంగ్ నగరంలో, బోర్నియో ద్వీపంలోని పొంటియానాక్ నగరంలో కూడా జరిగాయి.

# పోలీస్ స్టేషన్ ఎదుట జేసీ ప్రభాకర్ రెడ్డి వినూత్న నిరసన!

**తాడిపత్రి – సూర్య వాస్తవం:** స్థానిక రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సరికొత్త నిరసనతో తాడిపత్రి టౌన్ పోలీస్ స్టేషన్ ఉలిక్కిపడేలా చేశారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ జేసీ ప్రభాకర్ రెడ్డి స్టేషన్ ముందే మంచం వేసుకుని పడుకొని వినూత్నంగా ధర్నాకు దిగారు. రెండు రోజుల క్రితం వైఎస్సార్సీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి స్థానిక టీడీపీ కౌన్సిలర్లను ఉద్దేశించి తీవ్ర అనుచిత వ్యాఖ్యలు చేశారని జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గీయులు ఆరోపిస్తున్నారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పెద్దారెడ్డిపై కేసు నమోదు చేయాలని జేసీ ప్రభాకర్ రెడ్డి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఇచ్చి రెండు రోజులవుతున్నా పోలీసులు కేసు నమోదు చేయడంలో వెనకడుగు వేస్తున్నారని, అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారని జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల అలసత్వానికి నిరసనగా.. తన అనుచరులు, టీడీపీ శ్రేణులతో కలిసి భారీ సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు కదిలేది లేదంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి పోలీస్ స్టేషన్ ముందే మంచం వేయించుకుని, దానిపై పడుకొని నిరసన కొనసాగించారు. ఈ సమాచారం అందడంతో నియోజకవర్గం నలుమూలల నుండి టీడీపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అదనపు బలగాలను మోహరించారు. ప్రస్తుతం తాడిపత్రిలో తీవ్ర ఉత్కంఠ భరిత వాతావరణం నెలకొంది.




Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada , Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A 4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a, near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001